జిల్లా ప్రధాన న్యాయాధికారిని కలిసిన కలెక్టర్


పూలమొక్కను అందజేస్తున్న కలెక్టర్

నిజామాబాద్ లీగల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన టి.వినయ్‌కృష్ణారెడ్డి సోమవారం జిల్లా ప్రధాన న్యాయధికారి జీవీఎన్ భరతలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టులోని ఛాంబ ర్‌లో ఆమెను కలిసి పూలమొక్కను అంద జేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే కార్యకలాపాలపై వారు చర్చించారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్, తదితరులు

ఒకే విడతలో రుణమాఫీ

- బీఆర్ఎస్ హయాంలో పదేళ్లలో రుణమాఫీ చేయలేదు
- రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు

నిజామాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం రుణమాఫీ ఒకే విడతలో చేసిందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రైతు నేస్తం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఆయన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి రైతువేదికల్లో నూతనంగా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ వ్యవస్థను వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. గత ప్రభుత్వం రైతు బంధు ఇచ్చి మిగతా పథకాలను రద్దు చేసిందన్నారు. పదేళ్ల పాటు వ్యవసాయ పరికరాలు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ఇవ్వలేదన్నారు. పేదలకు భూములను పంచింది ఇందిరమ్మ ప్రభుత్వమేనన్నారు. భూగరిష్ట పరిమితి చట్టం చేసి మిగులు భూమిని తీసుకొని పేదలకు పంచిందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో రైతుల కోసం 1.01 లక్షల కోట్లు ప్రభుత్వం ఖర్చు పెట్టిందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాటు రుణమాఫీ చేయకుంటే తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రుణమాఫీ చేసి చూపించామని సీఎం అన్నారు. జిల్లాలోని అర్సుల్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి రైతులు రైతు నేస్తం కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్నదాతకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందన్నారు. ఆధునిక సాంకేతికతను సాగు రంగానికి అనుసంధానం చేస్తూ రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సాగు రంగంలో ఇది సరికొత్త విప్లవానికి నాందిగా నిలుస్తుందన్నారు. జిల్లాలో తొలివిడతలో 31 రైతువే దికల్లో వీడియో కాన్ఫరెన్స్ వసతిని ఏర్పాటు చేయగా రెండవ విడతలో 49 రైతువేదికల్లో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. జిల్లాలో ఉన్న మిగతా రైతు వేదికల్లో కూడా వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. వీటి ద్వారా ప్రతీ మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులను సంప్రదించి తమ సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. సాగులో అనుసరించాల్సిన పద్ధతులపై పంట మార్పిడికి ఈ కాన్ఫరెన్స్‌లు

మిగతా 8వ పేజీలో...



పల్లెల్లో మొదలైన 'స్థానిక' ఎన్నికల సందడి

- ఎన్నికల్లో పోటీకి ఆశావహుల ప్రయత్నాలు
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నుంచి పోటీకి సన్నద్ధమవుతున్న నేతలు
- ఇప్పటికే తమవర్గాల మద్దతును కూడగడుతున్న నాయకులు
- ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేసిన జిల్లా యంత్రాంగం

నిజామాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని పల్లెల్లో మళ్లీ స్థానిక సందడి మొదలైంది. ఈ నెలాఖరులోపు స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టత వస్తుందని ప్రకటనలతో పార్టీల క్యాడర్‌లో జోష్ పెరిగింది. స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు కూడా పోటీ పడుతున్నారు. అధికార కాంగ్రెస్ నుంచే కాకుండా బీజేపీ, బీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. మొదట ఏ ఎన్నికలు నిర్వహించినా గ్రామాల్లో పోరుకు సన్నద్ధమవుతున్నారు. సర్పంచ్ నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ వరకు పోటీ చేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో పదవుల కాలం అయిపోయి సంవత్సరంన్నర అవుతుండటంతో మళ్లీ పట్టు సాధించేందుకు ఇప్పటికే పనిచేసిన మాజీలతో పాటు కొత్త తరం నేతలు ముందుకు వస్తున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ దఫా త్రిముఖ పోటీకి సన్నద్ధమవుతున్నారు. గతంతో పోలిస్తే ఈ దఫా అన్ని స్థాయిల్లో గట్టి పోటీనే ఇచ్చే విధంగా మూడు పార్టీల నేతలు సిద్ధమవుతున్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధమవుతుంది. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌ల ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గ్రామ పంచాయతీల పదవీకాలం పూర్తయి సంవత్సరంన్నర అవుతుంది. జిల్లాలో గతంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు 2019 జనవరిలో జరిగాయి. అన్ని గ్రామ పంచాయతీలో సర్పంచులు, వార్డు సభ్యులు ఫిబ్రవరి 2న పదవిని చేపట్టారు. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీల్లో సర్పంచులు అప్పుడు కొలువు దీరారు. వారితో పాటు వార్డు సభ్యులు కూడా ఎంపికయ్యారు. సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి 1, 2024లో పూర్తయ్యింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రత్యేక అధికారుల పాలనలోనే కొనసాగుతుంది. అప్పటి నుంచి గ్రామ పంచాయతీ పల్లెల్లో ఎన్నికలు నిర్వహిస్తారని సర్పంచులతో పాటు వార్డులకు ఎంపిక కావచ్చని ఎక్కువ మంది ప్రయత్నాల్లో ఉన్నారు. సంవత్సరంన్నరగా ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీలు ప్రస్తుతం ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా ఎన్నికలు జరుగనున్నాయి. జిల్లాలో గ్రామ పంచాయతీలతో పాటు మండల పరిషత్‌కు ఎంపీటీసీ ఎన్నికలను కూడా నిర్వహించనున్నారు. ఎంపీటీసీలతో పాటు జడ్పీటీసీ ఎన్నికలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 33 మండలాలు ఉండగా 2 అర్బన్ మండలాలను మినహాయిస్తే 31 మండలాలకు ఎన్నికలను నిర్వహించనున్నారు. గతంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కోసం ఏప్రిల్ 20, 2019లో నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ ఎన్నికలను మే 6, మే 10, మే 14న మూడు విడతల్లో ఎన్నికలను జిల్లాలోని రెవెన్యూ డివిజన్ ఆధారంగా నిర్వహించారు. అదే నెల లెక్కింపును పూర్తి చేశారు. జూన్ 2న జడ్పీ ఛైర్మన్‌తో పాటు ఎంపీపీలు పదవి స్వీకారం చేశారు. వీరి పదవికాలం కూడా గత సంవత్సరం జూన్‌లో పూర్తయ్యింది. జిల్లాలో 299 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 28 జడ్పీ స్థానాలకు గతంలో ఎన్నికలు జరిగాయి. ఆ తర్వాత మండలాలు పెంచడం వల్ల ప్రస్తుతం 31 మండలాలతో పాటు పెరిగిన ఎంపీటీసీ స్థానాలు కలిపి 307కు చేరింది. ఈ ఎన్నికల కోసం ఇప్పటికే ఓటరు లిస్టును సిద్ధం చేశారు. బ్యాలెట్ బాక్సులను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఏర్పాట్లను పూర్తి చేశారు. ఒకదఫా సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు. ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకున్నా ఎన్నికలు నిర్వహించే విధంగా ఏర్పాట్లను చేశారు.

పల్లెల్లో మళ్లీ రాజకీయ సందడి

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెలలో ఎన్నికలు నిర్వహిస్తున్నామని ప్రకటనలు వెలువడుతున్న నేపథ్యంలో పల్లెల్లో మళ్లీ రాజకీయ సందడి మొదలైంది. ఈ దఫా ఎలాగైనా ఎన్నికలు నిర్వహించనుండటంతో అన్ని పార్టీల నేతలు సిద్ధమవుతున్నారు. మొదట ఏ ఎన్నికలు నిర్వహించిన పోటీ చేసేందుకు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ముందుగా ఎన్నికలను నిర్వహిస్తే ఈ దఫా అధికార కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌ల నుంచి పోటీ చేసేందుకు నేతలు సన్నద్ధమవుతున్నారు. గత ఎన్నికల్లో మొత్తం స్థానాల్లో 95 శాతం వరకు బీఆర్ఎస్ గెలుచుకుంది. మండల పరిషత్ అధ్యక్షులతో పాటు జడ్పీ పీఠాన్ని కైవసం చేసుకుంది.

మిగతా 8వ పేజీలో...

సిరికొండలో ఊపందుకున్న వ్యవసాయ పనులు

7

- వరినాట్లు, ఆరుతడి పంటల వైపు రైతుల చూపు
- డ్రిప్ పద్ధతిలో అధిక సంఖ్యలో రైతుల సాగు



అప్రమత్తతే శ్రీరామ రక్ష!

7

- వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలకు అవకాశం
- విద్యుత్‌పై నిర్లక్ష్యం చేస్తే ప్రాణనష్టం
- ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు

గుట్టుగా గుట్కా అమ్మకాలు!

- విచ్చలవిడిగా వినియోగం.. లక్షల్లో వ్యాపారం
- తగ్గుముఖం పట్టిన పోలీసుల తనిఖీలు
- జోరుగా కొనసాగుతున్న దందా

7




నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు

పీఎంపీ, ఆర్ఎంపీల ర్యాలీ ఉద్రిక్తత

- ఆర్ఎంపీపై చెప్పుతో దాడి చేసిన మహిళ
- వైద్యం కోసం వెళితే అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఆగ్రహం

నిజామాబాద్ అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆర్ఎంపీ, పీఎంపీలు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. డిచ్‌పల్లికి చెందిన ఓ ఆర్ఎంపీ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడంటూ ఓ మహిళ అతడిపై చెప్పుతో దాడి చేసిన ఘటన కలకలం రేపింది. నిజామాబాద్ నగరంలో సోమవారం పూలాంగ్ చౌరస్తా నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ఆర్ఎంపీ, పీఎంపీలు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన ఘటనతో ర్యాలీలో ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామీణ స్థాయిలో పేద ప్రజలకు రాత్రింబవళ్లు తమ సమస్యలను పరిష్కరిస్తున్నామని వారు ఈ ర్యాలీని నిర్వహించారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆర్ఎంపీ, పీఎంపీలు తెలిపారు. అయితే ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ చౌరస్తా వద్ద మాట్లాడుతున్న సమయంలో డిచ్‌పల్లికి చెందిన ఓ ఆర్ఎంపీపై ఓ మహిళ చెప్పుతో దాడి చేసింది. వైద్యం కోసం వెళితే అతడు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని సదరు మహిళ ఆరోపించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల


శ్రీహర్షిణిని అభినందిస్తున్న డీఐఈవో


నిజామాబాద్ అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో మే నెలలో నిర్వహించిన సప్లిమెంటరీ పరీక్షల్లో 57.46 శాతం ఉత్తీర్ణతను విద్యార్థులు సాధించారు. ఇంటర్మీడియెట్ సెకెండియర్‌లో మొత్తం 6497 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 3733 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. ఒకేషనల్‌లో 899 మంది విద్యార్థులు హాజరుకాగా 503 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో 10098 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 5851 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 58 శాతం ఉత్తీర్ణత సాధించారు. వొకేషనల్‌లో 1420 మంది విద్యార్థులు హాజరుకాగా 900 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్ రెండవ సంవత్సరం ఫలితాల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో 20వ స్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో 26వ స్థానంలో నిలిచింది. ఇంటర్ పరీక్షలకు హాజరైన వారు రీవాల్యుయేషన్, వెరిఫికేషన్ చేసుకునేందుకు ఈనెల 17 నుండి 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని ఇంటర్ జిల్లా విద్యాధికారి రవికుమార్ తెలిపారు. ఒకేషనల్ ఆఫీస్ అసిస్టెంట్ షిప్ కోర్సులో మొదటి సంవత్సరంలో ఇంప్రూమెంట్‌లో అత్యధిక మార్కులు 500లకు 493 సాధించిన శ్రీ హర్షిణి ఇంటర్ విద్యాధికారి అభినందించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతూ ఈ మార్కులు సాధించారని తెలిపారు.

రేపు దివ్యాంగుల బడిబాట కార్యక్రమం

నిజామాబాద్ అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో మానసిక వికలాంగులు, అంధుల ప్రత్యేక అవసరాల గుర్తింపు శిబిరం, బడిబాట కార్యక్రమానికి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ ఎస్.జ్యోతి సిద్దయ్య, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, స్పెషల్ ఎడ్యుకేటర్ పి.సుజాతలు తెలిపారు. ఈనెల 18న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహిస్తామని అన్నారు. ఇందులో భాగంగా అంధులు, మానసిక వికలాంగులు అర్హులుగా పేర్కొన్నారు. బుద్ధి మాంద్యం, అందత్వం ఆటిజం అంధత్వంతో పాటు మరొక వైకల్యం ఉన్న బాల వికలాంగులు అర్హులుగా పేర్కొన్నారు. మానసిక దివ్యాంగ విద్యార్థులకు సహాయ పరికరాలు ఉచితంగా ఇవ్వడం, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం, వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కార మార్గాలు జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు.

సార్వత్రిక సమ్మె బుక్‌లెట్ విడుదల

నిజామాబాద్ కల్చరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వచ్చే నెల9న నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మె బుక్‌లెట్‌ను సీఐటీయూ నాయకులు విడుదల చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, జిల్లా నాయకులు సార్వత్రిక సమ్మె బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ.. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జూలై 9న నిర్వహించతలపెట్టిన సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను నిలువరించి ఐక్యమత్యంగా పోరాడాలని అన్నారు. కార్మికులపై కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మికులకు ఉపయోగపడే విధానాలను అవలంబించాలని అన్నారు. ఇప్పటి వరకు 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులకు నష్టం చేసే విధంగా మోదీ ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. 8 గంటలు కార్మికుల శ్రామ కాలాన్ని 12 గంటలకు పెంచుతుందని యూనియన్‌లు ఏర్పాటు చేసుకోవడానికి కూడా వీలు లేకుండా కొత్త చట్టాలను అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు గణేష్, బుచ్చయ్య, రమేష్, నరేష్, అజయ్, సురేష్, విజయ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



● ఆరుబయట వంట చేస్తున్న దృశ్యం

శిథిలావస్థలో సిర్పూర్ పాఠశాల

- పెచ్చులూడుతున్న తరగతి పైకప్పు
- తరగతిలో చేరుతున్న వాన నీరు
- పాఠశాల కిటికీలు, తలుపులకు చెదలు
- పాఠశాల ఆవరణలో విద్యార్థులకు వంట
- మూత్రశాలలు లేక తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

డొంకేశ్వర్, జూన్16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్పూర్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. తరచూ తరగతి గదుల్లో పైకప్పు పెచ్చులూడి కిందపడుతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో తరగతి గోడలు పూర్తిగా తడిచి ప్రమాదకరంగా మారుతున్నాయి. దీంతో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు బిక్కుబిక్కుమంటూ గడిపేస్తున్నారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడితో పాటు ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు 65 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే పాఠశాలలకు చెందిన పలు భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో మూడు గదుల్లోనే ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. కిటికీలు, తలుపులకు చెద వచ్చి పూర్తిగా దెబ్బతిన్నాయి. పాఠశాల ఆవరణలో విషసర్పాలు సంచరిస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వాటి నుంచి రక్షణగా ఉండేందుకు కిటికీలకు అట్టముక్కలను అడ్డంగా పెడుతున్నారు. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో పెచ్చులు ఊడి విద్యార్థులు చదువుకునే సమయంలో మీద పడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. వర్షం వస్తే స్లాబ్‌పై నుంచి తరగతి గదిలోకి వర్షం నీరు కారుతోందని వాపోతున్నారు. పాఠశాలకు చెందిన వంటగది సైతం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు గోడలు కూలుతాయో తెలియని పరిస్థితిలో వంటగది ఉంది. దీంతో పాఠశాల ఆవరణలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని తయారు చేస్తున్నారు. మూత్రశాలలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకటికైనా రెండింటికైనా విద్యార్థులు ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో రాత్రిపూట పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో నూతన భవన నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



పాఠశాలలో తరగతి గదుల కొరత ఉంది..

: రమేష్, పాఠశాల హెచ్‌ఎం

సిర్పూర్ ప్రైమరీ పాఠశాలలో తరగతి గదుల కొరత ఉంది. గతంలో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం పాఠశాలకు చెందిన మూడు గదులలో ఐదు తరగతును నిర్వహిసున్నాం. పాఠశాల ప్రక్కన ప్రహరీ కూలిపోవడంతో రాత్రి సమయంలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది. మూత్రశాలలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో శిథిలావస్థకు చేరిన గదులను తొలగించి కొత్త భవనాలను నిర్మించాలి.

ఆర్మూర్ పట్టణ గ్రంథాలయ సందర్శన



గ్రంథాలయాన్ని సందర్శించిన చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి

పెర్కిట్, జూన్16 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని గ్రంథాలయాన్ని సోమవారం జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ప్రొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. గ్రంథాలయంలోని కిటికీలకు, తలుపులకు కర్టన్‌లను ఏర్పాటు చేసినందుకు గాను ఈ సందర్భంగా వినయ్‌కుమార్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్మూర్‌లో ఉన్న గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని పట్టణం, చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలను కోరారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, మోత్కూరి లింగాగౌడ్, శ్యాంగౌడ్, లిక్కి శంకర్, శేక్‌బబ్లు, తదితరులు పాల్గొన్నారు.

కబ్జా చేసిన భూములను ప్రభుత్వం స్వాధీన పర్చుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆర్మూర్ రూరల్, జూన్16 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేశారని అట్టి భూములను ప్రభుత్వం వెంటనే స్వాదీన పర్చుకోవాలని డిమాండ్ చేస్తు సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య మాట్లాడుతూ ఆర్మూర్ పట్టణంలోని వివిధ వార్డులలో ప్రభుత్వ భూమి, ఇరిగేషన్ కాలువకు సంబంధించిన ప్రభుత్వ భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు దర్జగా కబ్జా చేసి ప్లాట్లు చేసి విక్రయించి సొమ్ముచేసుకుం టున్నారని అన్నారు. ఈ ధర్నాలో సీపీఎం నాయకులు నాగరాజు, సాయిలు, కుల్దీప్ శర్మ, లక్ష్మీ, ఎర్రన్న, ఓంకార్, రఫీక్, లల్యా నాయక్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి మృతి

జుక్కల్,జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలం పెద్ద ఏడికి గ్రామానికి చెందిన హనుమంతు (40) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ తెలిపారు. వృత్తిని భార్య గంగామణి తెలిపిన వివరాల మేరకు మృతుడు హనుమంతు గత ఆరు నెలల నుండి పనిచేయకుండా జులాయిగా తిరుగుతూ మద్యం సేవిస్తూ ఇంటికి వచ్చి తనకు పిల్లలకు గొడవకు దిగుతున్న దిగుతున్నాడని ఆమె అన్నారు. మృతునికి భార్య పిల్లలు ఉన్నారు. మృతుని భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ

భీమ్‌గల్ రూరల్, జూన్16 (ఆంధ్రజ్యోతి): మహిళ సంఘాల సభ్యులకు సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో భీమ్‌గల్ మండల మహిళ సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాల అధ్యక్షురాలు, కార్యదర్శి కోశాధికారులకు జిల్లా సీఆర్పీలు శిక్షణ తరగతులు నిర్వహించారు. అలాగే శిక్షణలో భాగంగా వీవోలకు విధులు, బాధ్యతలు, ఆర్థిక ఆవాదేవీలు, సంఘ సమావేశాలు, పుస్తక నిర్వహణలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రవీందర్, సీనియర్ సీసీలు కుంట శ్రీనివాస్, పురస్తు నరేష్, సీఆర్పీలు లత, అంజలి, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బిహార్ కూలి మృతి

కోటగిరి, జూన్16(ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రంలోని ముజాఫర్ జిల్లాగా యఘాట్ తాలూకా లోమా గ్రామానికి చెందిన రాజేష్ కుమార్ సహని(32) అనే బిహార్ కూలి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కోటగిరి ఎస్ఐ సునీల్ తెలిపారు. వివరాల్లోకి వెళితే పోతంగల్ మండలంలోని కల్లూర్ గ్రామానికి వరినాట్లు వేసేందుకు ఈ నెల 10న తేదిన వచ్చాడు. నాటు వేసిన అనంతరం కొడిచర్ల శివారులోని మంజీర నదిలో కాలకృత్యాలు తీర్చుకోనేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి మంజీర నది నీటిలో పడ్డాడు. తోటి కూలిలు గమనించి రాజేష్ కుమార్‌ను బయటకు తీశారు. చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. మృతుడి తమ్ముడు వీరేంద్ర కుమార్ సహని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామాల్లో విద్యార్థుల సౌకర్యార్థం బస్సులను నడపాలి

బోధన్‌రూరల్, జూన్16(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో విద్యార్థుల ఇబ్బందులు తలెత్తకుండా సమయపాలన పాటిస్తూ బస్సులు నడిపించాలని తెలుగు యువత నాయకులు రాజేందర్ సోమవారం ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందించారు.ఈసందర్భంగా ఆర్టీసీ డీఎం మాట్లాడుతూ వి ద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా గ్రామాల్లో బస్సులను నడిపిస్తామన్నారు.

అమ్దాపూర్ గ్రామంలో రేషన్ బియ్యం ఇవ్వాలి

బోధన్‌రూరల్, జూన్16(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలోని రేషన్ కార్డులు ఉన్న వారందరికీ రేషన్ బియ్యం ఇవ్వాలని మాజీ ఎంపీటీసీ విఠల్ గౌడ్ కోరారు. 15వ తేది నుంచి తమ గ్రామంలోని రేషన్ షాపులలో రేషన్ బియ్యం కొరత ఏర్పడిందన్నారు. రేషన్ డీలర్‌ను అడిగితే పూర్తిస్థాయి కోటా రాలేదని మళ్లి కోట వచ్చిన తర్వాతనే ఇస్తామని పేర్కొంటున్నారని అన్నారు.

ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థి

బోధన్‌రూరల్, జూన్16(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణానికి చెందిన విద్యార్థి ఐఐటీలో సీటుసాధించాడు. ఆలిండియా లెవెల్‌లో నిర్వహించిన ఐఐటీ ప్రవేశ పరీక్ష ఫలితాలలో పట్టణంలోని శక్కర్‌నగర్‌కు చెందిన ప్రణయ్ సాయి 2079ర్యాంకు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. విద్యార్థి ప్రణయ్ సాయితో పాటు తల్లిదండ్రులు లత, కారం స్వామిలను అభినందిస్తు న్నారు.హైదరాబాద్‌లోని ఐఐటీలో సీటు రావడం పట్ల పలువురు విద్యార్థిని అభినందిస్తున్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

బోధన్‌రూరల్,జూన్16(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం కల్దుర్కి గ్రామానికి చెందిన ఆకాష్(17)అనే ఇంటర్ విద్యార్థి అదృశ్యం అయినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కల్దుర్కి గ్రామానికి చెందిన ఆకాష్ ఆదివారం తన మేనమామ స్వగ్రామామైన బాసరకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లాడని తల్లి శాంతబాయి ఫిర్యాదులో పేర్కొందన్నారు. మధ్యాహ్నం సమయంలో ఫోన్ చేసి మేనమామ లేకపోవడంతో తిరిగి వస్తున్నానని చెప్పడం జరిగిందన్నారు. సోమవారం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఆకాష్ తల్లి శాంతబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యవసాయ కూలీలందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలి

మోర్తాడ్,జూన్16 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కూలీలందరికీ ఆత్మీయ భరోసా ఇవ్వాలని కోరుతూ అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం నిజామాబాద్ రూరల్ కామారెడ్డి, సంయుక్త జిల్లా అధ్యక్షుడు జి. కిషన్ డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో దయాల్‌సింగ్, గంగపోసాని,పద్మ, భూమ గంగు, శ్రీనివాస్, దశరత్, లక్ష్మీ, అంజలి, సలీమ, వివిధ గ్రామలకు చెంది న వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారందరినీ అరెస్టు చేయాలి

● మోర్తాడ్ గ్రామ కుల సంఘాల డిమాండ్



మోర్తాడ్ జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న గ్రామస్థులు

మోర్తాడ్, జూన్16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సోమవారం మోర్తాడ్ కు చెందిన కుల సంఘాల ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఇటీవల ఒకవర్గం వారు గ్రామానికి చెందిన రొయ్యల సురేష్‌ను దాడిచేసి రాడుతో కొట్టి ఆయన పాదాలపై బుల్లెట్ వాహనం నడిపించడంతో కాళ్లు విరగడంతో పోలీసులు 40 మంది దాడిచేస్తే కేవలం 6గురిపై కేసులు నమోదు చేయడంతో ఆగ్రహంతో కులసంఘాల పిలుపుతో వందలాది గ్రామస్థులు ధర్నాలో పాల్గొన్నారు. ఉదయం సుమారు గంటన్నర సేపు ధర్నా నిర్వహించారు. భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎస్సైలు, పోలీసులు, ప్రత్యేక పోలీసులు భారీ ఎత్తున్న మోహరించారు. మోర్తాడ్‌లో గ్రామస్థులు ర్యాలీ నిర్వహిస్తారని తెలిసి పోలీసులు అధిక సంఖ్యలో గ్రామంలో వాహనాలపై పెట్రోలింగ్ నిర్వహించారు. కాగా గ్రామస్థులందరు కలిసి ర్యాలీగా జాతీయ రహదారివద్దకు వెళ్లి బైఠాయించారు. గంటసేపు జరిగిన ధర్నా అనంతరం సీఐ సత్యనారాయణ, ఎస్సైలు ధర్నా విరమించాలని కోరిన ఆందోళన కారులు దాడిలో పాల్గొన్న వారిందరిని అరెస్టు చేస్తామని హామి ఇస్తేనే ఆందోళన విరమిస్తామని తేల్చి చెప్పడంతో అధికారులు కొద్దిసేపు ఏమి చేయ లేక పోయారు. చివరకు ఆందోళనకారులతో మాట్లాడుతూ 24 గంటల్లో మిగితా నిందితులను అరెస్టు చేస్తామని సీఐ సత్యనారాయణ, మోర్తాడ్ ఎస్సై విక్రం హామి ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం గ్రామస్థులు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కృష్ణను కలిసారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామంలో మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కావద్దని ఆందోళన కారులు కోరారు. ఈ ఆందోళనలో అన్ని కులసంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అడ్డుకోవాలి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంసీపీఐ నాయకులు



చేపూర్‌లో ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న వినయ్‌రెడ్డి

బోధన్‌రూరల్,జూన్16(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్, శ్రీరాంనగర్ కాలనీలలో ఫ్యాక్టరీ భూముల్లో కొందరు అక్రమంగా ఇంది రమ్మ ఇళ్లను కడుతున్నారని వారిని అడ్డుకోవాలని ఎంసీపీఐ పార్టీ పట్టణ కార్యదర్శి ఎండీ మోసిన్ సోమవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను నిరుపేదలకు ఇస్తుండగా కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టి ఇందిరమ్మ లోన్లు తీసు కుంటున్నారని ఆరోపిస్తూ వీటిని అడ్డుకోవాలని కోరారు. అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో తోట సంగీత, ఎంసీపీఐ నాయకులు ఉషా, శోభ, హైమద్, పార్టీ నాయకులు తదితరులున్నారు.

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పాషా మోయినోద్దీన్, శరత్‌రెడ్డిలు అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని పలు వార్డులలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇటీవల ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన లబ్ధిదారులు తమ ఇళ్ల పనులను వేగవంతం పూర్తి చేయాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందరికి విడతల వారిగా బిల్లులు అందజేయబడతాయన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురి కావద్దన్నారు. ప్రజల సొంతింటి కల నెరవేరుస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాము, వహీద్, ఇమ్రాన్‌లతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలం చేపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను సోమవారం ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి పంపిణీ చేశారు. నలుగురికి ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. చేపూర్, హరిపూర్ గ్రామంలో 60 ఇందిరమ్మ ఇళ్లకు రూ. 5లక్షలు మంజూరయ్యాయని వినయ్‌రెడ్డి తెలిపారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జన్నపల్లి గంగాధర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ఆర్మూర్ రూరల్, జూన్16 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని సీకన్వెన్షన్ హాల్‌లో సోమవారం 50 మందికి సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట్, డొంకేశ్వర్, ఆలూర్, ఆర్మూర్ మండలాలతో పాటు పట్టణ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వినయ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ ఎవరికి టికెట్ కేటాయించిన కలిసి కట్టుగా పనిచేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ సాయిబాబాగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, మంద మహిపాల్, భూమేష్, ముక్కెర విజయ్, రవిగౌడ్, మాజీ ఎంపీపీ పస్క నర్సయ్య, లింగాగౌడ్, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ ఇట్టెం జీవన్, మాజీ సర్పంచ్ జీవన్‌రెడ్డి, పండిత్ పవన్, రింగుల భూషన్, తదితరులు పాల్గొన్నారు.



ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోధన్‌రూరల్, జూన్16(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని శర్బత్ కెనాల్, సరస్వతి నగర్, ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా, పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ తదితర ప్రాంతాలలో మంగళవారం విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ టౌన్-1 ఏఈ నాయిని కృష్ణ తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను చేపడుతున్నామన్నారు. విద్యుత్ సరఫరాలో లోపాలను గుర్తించి సరి చేస్తున్నామని కావున ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రైతు నేస్తంలో అధికారులు నాయకులు

ఏర్గట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రైతు నేస్తంలో భాగంగా 1031 రైతు వేదికలను వీడియో కాన్ఫిరెన్స్ అనుసంధానం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని నాయకులు అధికారులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమదేవరెడ్డి,బాల్కొండ బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడెం గంగా ప్రసాద్, రాజారెడ్డి, ముస్కు మోహన్, రేండ్ల రమేష్, రొక్కెడ సంజీవ్, గడ్డం జీవన్,అధికారులు ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శివచరణ్ పాల్గొన్నారు.

చెరువు తూము మరమ్మతు పనులు పూర్తి



చెరువు తూము మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

కోటగిరి, జూన్16(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని లింగాపూర్ కామక్క చెరువు తూము మరమ్మత్తు పనులను ఇరిగేషన్ అధికారులు చేపట్టారు.ఈ నెల 9వ తేదిన 'ఆంధ్రజ్యోతి'లో ప్రమాదకరంగా కామక్క చెరువు తూము అనే కథనానికి అధికారులు స్పందించారు. చెరువు తూము వద్ద ప్రమాదకరంగా మారిన తూము గుంతలో పైపులైన్ వేసి గుంతను పూడ్చివేశారు. ప్రమాదకరంగా మారిన చెరువు తూము మరమ్మత్తు పనులు పూర్తి చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలి

బోధన్‌రూరల్, జూన్16(ఆంధ్రజ్యోతి):మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ అన్నారు. సోమవారం బోధన్‌పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో ప్రయాణికులు, ప్రజలతో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.మత్తుపదార్థాల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిష్టాపూర్‌లో విద్యుదాఘాతంతో గేదె మృతి

బీర్కూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో సోమవారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. కిష్టాపూర్ గ్రామానికి చెందిన సాయిలు అనే పాడి రైతుకు గేదెలు ఉన్నాయి. అయితే ప్రతీ రోజులాగే సోమవారం గేదెలను మేపడం కోసం గ్రామ సమీపంలోని మంజీరా నది ఆయకట్టు ప్రాంతానికి తీసుకు వెళ్లాడు. ఒక గేదె మేత మేస్తూ వ్యవసాయ క్షేత్రంలోని ట్రాన్స్ ఫార్మర్ వద్దకు వెళ్లింది. ట్రాన్స్ ఫార్మర్‌కు తగలడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె మృతితో తనకు రూ.80 వేల నష్టం వాటిల్లినట్టు బాధితుడు సాయిలు తెలిపాడు.

డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని ధర్నా

కోటగిరి, జూన్16(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయంలో డబుల్ బెడ్ రూమ్ పథకం కింద ఇళ్లు నిర్మించుకున్న లబ్దిదారులకు రెండేళ్లు అయిన పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించకపోవడంపై సీపీఐ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులతో కలిసి సీపీఐ నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ మాట్లాడుతూ కోటగిరి గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ పథకం కింద 170మంది ఇళ్లు నిర్మించుకున్నారని ఆయన పేర్కొన్నారు.అప్పు చేసి మరి ఇల్లు నిర్మించుకున్న లబ్దిదారులకు బిల్లులు చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పందించి ఇల్లు నిర్మించుకున్న లబ్దిదా రులందరికీ బిల్లులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధ్రుతం చేస్తామని హెచ్చరించారు.వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈకార్య క్రమంలో డబుల్ బెడ్‌రూమ్ లబ్దిదారులు శంకర్, ముజీబ్, మక్కయ్య, నసీర్, తిరుపతి, గంగారాం, తదితరులున్నారు.

పదవ తరగతి, ఇంటర్ దూర విద్య ప్రవేశాలు ప్రారంభం

వేల్పూర్, జూన్16 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్ దూర విద్య ప్రవేశాలు ప్రారంభమయ్యాయని పాఠశాల హెచ్ఎం రాజన్న తెలిపారు. ఈనెల 12 నుండి జులై చివరివరకు అడ్మిషన్లు చేసుకోవచ్చున్నారు. పదోతరగతిలో అడ్మిషన్లు పొందే విద్యార్థులు టీసీ, తహసీల్దార్ ఇచ్చిన బర్త్ సర్టిఫికట్, కుల ధృవీ కరణ పత్రం, ఆధార్‌కార్డు అన్ని రెండు సెట్‌ల జిరాక్స్‌లు, రెండు ఫోటోలు అలాగే ఇంటర్మీయట్‌లో అడ్మిషన్లు తీసుకునే విద్యార్థులు టెన్త్ మెమో, టీసీ, కులధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు ఫోటోలు అందజేయాలన్నారు. 2025-26 విద్య సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్‌కోర్సులో ధరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రవేశాల కోసం సంబంధిత ధ్రువపత్రాలతో సంప్రదించాల్సిన వివరాలకు బౌడ దేవానందం(9440839040), ఎస్. శైలేజ(8522855825) నంబర్లకు సంప్రదించాలని కోరారు.

రెవెన్యూ సదస్సులో వచ్చిన సమస్యలను పరిష్కరించాలి

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్‌రూరల్,జూన్16(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. సోమవారం సాలూర మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శశిభూషణ్ రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు. రెవెన్యూ సదస్సులో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలన్నారు.ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

ఎడపల్లి: రైతుల భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి రైతులను భూ సమస్యల నుంచి విముక్తి కలిగించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టి, గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రి అన్నారు. ఈ నెల 3వతేదీ నుంచి 16 వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని, భూ సమస్యలు ఉన్న రైతులు తమ సమస్యలను అధికారులకు విన్నవించడం జరిగింద న్నారు. అందులో భాగంగా సోమవారం ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో రెవెన్యూ సదస్సును నిర్వహించగా ఎడపల్లి గ్రామానికి చెందిన సుమారు 149కి పైగా వివిధ రకాల దరఖాస్తులు వచ్చాయని వీటితో కలిపి మండలంలో మొత్తం 698 భూ సమస్యలపై దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్‌లు అనూష, మండల వ్యవసాయ అధికారి సిద్ది రామేశ్వర్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ఎడపల్లి గ్రామ రైతులు తదితరులున్నారు.



సాలూరలో రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

కోటగిరి: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గంగాధర్ సూచించారు. కోటగిరి మండలంలోని ఎక్లాస్‌పూర్, పొతంగల్ మండలంలోని కారేగాం గ్రామాలలో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్‌లు అజీజ్, మధు పాల్గొన్నారు.

ఏర్గట్ల: రైతు సదస్సులో భాగంగా దరఖాస్తులు సమర్పించని వారి వద్ద నుంచి ఈ నెల 20 వరకు దరఖాస్తులు స్వీకరిస్తా మని తహసీల్దార్ మల్లయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి కౌంటర్‌లో దరఖాస్తులు చేసుకోవడానికి ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రైతు వేదికలో సీఎం కార్యక్రమం వీక్షణ



ఆలూర్‌లో సీఎం వీడియోకాల్ కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న అన్వేష్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్ జూన్16 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్, ఆలూర్ మండలాలలోని రైతు వేదికల్లో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ల ప్రారంభోత్సవం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లు రైతులు తమ సమస్యలు కావాల్సిన సూచనాలను నేరుగా దృష్య, శ్రవణ మాధ్యంద్వారా శాస్త్రవేత్తలతో మాట్లాడి తెలుసుకోవడానికి తోడ్పడుతాయని ముఖ్యమంత్రి సూచించారు. ఆర్మూర్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, డీసీవో శ్రీనివాస్ హాజరుకాగా ఆలూర్‌లో రాష్ట్ర విత్తనాభివృద్ధి చైర్మన్ అన్వేష్ రెడ్డి, హాజరై రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ విజయలక్ష్మీ, ఏవోలు హరికృష్ణ, రాంబాబు, మండలపార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్, కల్లెం బోజారెడ్డి, బార్ల ముత్యం, ఉదయ్, ఆర్మూర్‌లో ఏఎంసీ చైర్మన్ సాయిబాబగౌడ్, పెర్కిట్ సొసైటీ చైర్మన్‌భోజారెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కేటీఆర్ మచ్చలేని నాయకుడు

● జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ విఠల్‌రావు



కేటీఆర్‌ను కలిసిన విఠల్‌రావు

మాక్లూర్,జూన్16 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికోసం ఎంతో పాటుపడిన బీఆర్ఎస్ నాయకుడు కల్వకుంట్ల తారకరామారావు మచ్చలేని నాయకుడని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. ఫార్ములా ఈకార్ విచారణ నిమిత్తం ఏసీబీ అధికారులు సోమవారం ఆయనను పిలువగా విఠల్‌రావు ఆయనను కలిసారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణరాష్ట్రాన్ని జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో కేటీఆర్ గుర్తింపు తెచ్చారని అలాంటినాయకుడిపై కాంగ్రెస్‌పార్టీ నాయకులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చకుండా అభివృద్ధి చేసిన నాయకులపైకేసు లు బనాయిస్తున్నారని అలాంటి వారికిరానున్నరోజుల్లో ప్రజలేతగిన గుణపా ఠం చెప్తారని అభివృద్ధిచేసిన వారికి పట్టంకట్టడం ఖాయమని ఆయన అన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాదిగ సంఘాల

యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు

ఆర్మూర్‌రూరల్, జూన్16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ టి. వినయ్‌కృష్ణ రెడ్డిని సోమవారం మాజీ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.ఈసందర్భంగా ఎస్సీ కులధ్రువీకరణ పత్రాలను ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి మాల,మాదిగ సర్టిఫికెట్‌లు తీసుకుంటున్నారని ప్రభుత్వం వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని కొక్కెర భూమన్న కలెక్టర్‌ను కోరారు. ఏ రాష్ట్రం లో కూడా తెలంగాణ దళితులకు కులధృవీకరణ పత్రాలు ఇవ్వరని ఇక్కడ అలాంటి నిబంధనలు లేకపోవడంతో అసలైన దళితులకు అన్యాయం జరుతుందని కలెక్టర్‌కు విన్నవించారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న కొక్కెర భూమన్న

అంగన్‌వాడీ కేంద్రాలలో సామూహిక అక్షరాభ్యాసం



సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

బోధన్‌రూరల్, జూన్16(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంతో పాటు మండలంలోని ఊట్‌పల్లి, సంగెం తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో సోమవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపిలక్ష్మి మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో చేరిన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయడం జరిగిందన్నారు. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలలో మంచిచదువుతో పాటు పౌష్టికాహారం అందజేయబడుతుందన్నారు.అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారులను ప్రైవేట్ స్కూళ్లలో చేర్పించి వేలకు వేలు ఫీజులు కట్టవద్దని, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో నాణ్యమైన విద్యను ప్రభు త్వం అందజేస్తుందన్నారు.ఈకార్యక్రమంలో అంగన్‌వాడీటీచర్లు నందిని, కలి మా, ఆస్మాబేగం,గిరిజా,కమల,చిన్నారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు పాటించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు

ఎడపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు పాటించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో సూచించారు. ఎడపల్లి మండలంలోని ఎడపల్లి, జానకంపేట రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జానకంపేట రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌ను ప్రారంభించారు. ఖరీఫ్ సాగులో రైతులు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించడంతోపాటు రైతులకు అవసరమైన మరిన్ని సహాయ, సహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దత్తాత్రి, ఉపతహసీల్దార్ అనూష, మండల వ్యవసాయ అధికారి సిద్ధిరామేశ్వర్, మండల విస్తీర్ణ అధికారులు జ్యోతి, శ్రీహరి, మండల రైతులు తదితరులు పాల్గొన్నారు.

సిద్దుల గుట్టపై ఘనంగా పల్లకీ సేవ

పెర్కిట్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలో నవనాథ్ సిద్దుల గుట్టపై సోమవారం ఆలయ కమిటి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో పంచామృతాలతో అభిషేకాలు, రామాలయం, దుర్గమాత, దత్తాత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మతల్లి, హనుమాన్ ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకి సేవలో ఆర్మూర్ ఎమ్మెల్యే కుమార్తె పైడి సుచరితరెడ్డి పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు పీసీ గంగారెడ్డి, బి.సుమన్, కొడిగెల మల్లయ్య, ప్రశాంత్‌గౌడ్, చరణ్‌రెడ్డి, బట్టు శంకర్ పాల్గొన్నారు.

వ్యవసాయ పనులు ప్రారంభించిన రైతులు

● సిరికొండ మండలంలో అడపా దడపా వర్షాలు ● వరి నాట్లు, ఆరుతడి పంటల వైపు రైతుల దృష్టి


గడ్కోల్‌లో పసుపు విత్తనాన్ని విత్తుతున్న మహిళా రైతులు

సిరికొండ జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాలు కురుస్తుండున రైతులు పంటలు సాగు చేయడం ప్రారంభించారు. మృగశిర కార్తె గడిచిపోతున్నందున వర్షాలు కూడా అడపా దడపా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలతో పాటు వరి నాట్లు వేయడం మొదలుపెట్టారు. గడ్కోల్, న్యావనంది, చీమన్‌పల్లి, కొండాపూర్, తూంపల్లి తదితర గ్రామాల్లో ఆరుతడి పంటలైన పసుపు, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. ముఖ్యంగా బోరుబావుల్లో నీళ్లు ఉన్న రైతులు పంటల సాగును ప్రారంభించారు. కొండూర్ గ్రామంలో అయితే రైతులు ముందస్తుగానే వరినాట్లు సాగు చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల కంటే ముందుగానే కొండూరులో వరి నాట్లు వేయడం ఆరంభించారు. ఆ గ్రామంలో వరిపుటాలు ముందుగానే పోశారు. వారిని గమనిస్తున్న రైతులు మిగిలిన గ్రామాల్లో బోరుబావుల్లో నీల్లున్న రైతులు వరి పుటాలు పోశారు. పోస్తూనే ఉన్నారు. పలు గ్రామాల్లో రైతులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి వేయడానికి సిద్ధంగా ఉంచుకున్నారు. కొండూర్ గ్రామ పరిధిలో రెండు వాగులు ఉండడం వల్ల భూగర్భ జలాలు ఉన్న రైతులందరు నాట్లు వేయడం ప్రారంభించారు. పంట చేతుకొచ్చే వరకు వర్షాలు సమృద్ధిగా కురుస్తాయో లేదనే కారణంతోనే రైతులు ముందుగా సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. గడ్కోల్‌లో ఇప్పటికే ఆరుతడి పంటల విత్తనాలు విత్తుకున్నారు. డ్రిప్ పద్ధతిలో ఎక్కువ మంది రైతులు సాగుచేస్తున్నారు. దీనివల్ల మొదటి వర్షాలు కురిసిన మరుక్షణం నుంచి విత్తనాలు విత్తుకోవడం ప్రారంభించారు. ఇప్పటివరకు సిరికొండ మండలంలో వాగులు పారే వర్షాలు కురువలేదు కాని భూములు తడిసె వర్షాలు కురవడం వల్ల దుక్కులు దున్ని సాగుకోసం సిద్ధం చేసుకుంటున్నారు. నీళ్ల రైతులు మాత్రం తూకాలు పోసుకుంటున్నారు.


కొండూర్‌లో వరి నాట్లు వేస్తున్న కూలీలు

ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాం: నర్సయ్య, ఏవో

వనాకాలం పంట కోసం రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా అందుబాటులో ఉంచామని వ్యవసాయ అధికారి నర్సయ్య చెప్పారు.ప్రాథమిక వ్యవసాయ సహాకార సంఘాలు, ప్రయివేట్ విత్తనాల డీలర్లు, ఎరువుల డీలర్ల వద్ద రైతులకు సాగుకు కావలసిన విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందని నర్సయ్య చెప్పారు. మండలంలో ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికను పంపించామన్నారు. మండలంలో వరి పంట 28399 ఎకరాలలో, మొక్కజొన్న పంటను 425 ఎకరాలలో, సోయబీన్ 150 ఎకరాలలో,పసుపు 210 ఎకరాలలో రైతులు సాగుచేస్తారని అంచనా వేసినట్లు ఆయన వివరించారు. సాగుకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నయని అన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు డీలర్ల వద్ద రషీదులు తప్పని సరిగా తీసుకోవాలని వ్యవసాయ అధికారి నర్సయ్య రైతులను కోరారు.

గుట్టుగా గుట్కా అమ్మకాలు!

● గతంలో తయారీ, అమ్మకాలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం ● పోలీసుల తనిఖీలు తగ్గడంతో మళ్లీ మొదలు

కామారెడ్డిటౌన్,జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఆరోగ్యానికి హాని కల్గిస్తున్న గుట్కాను ప్రభుత్వం ఎప్పుడో బ్యాన్‌చేసింది. గుట్కాతో కలిగే అనర్థాలపై పలు రకాల ప్రచారం నిర్వహించిన వినియోగం మాత్రం తగ్గడం లేదు. జిల్లాలో నియంత్రణపై పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు దృష్టి సారించి గత సంవత్సరం ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టారు. తనిఖీలు చేపట్టిన కొన్ని నెలల వరకు అంతంతమాత్రంగానే అమ్మకాలు జరిపిన గుట్కా అమ్మకాలు మళ్లి జోరందుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్కువగా పాన్‌షాపుల వద్ద,గల్లిలలో ఉండే కిరాణా దుకాణాలలో విక్రయిస్తుండడం జిల్లాలోని ఆయా టీ పాయింట్ల వద్ద స్మోకింగ్ జోన్‌ల పేరుతో ఏర్పాటుచేసిన ప్రదేశాలలో గుట్కాను యువత విరివిగా ఉపయోగిస్తున్నారు. పోలీసులు తనిఖీలు అంతంతమాత్రంగానే ఉండడంతో మరోమారు గుట్కా విక్రయాలు జరుగు తున్నాయనే సమాచారం. పోలీసులు గతంలో మాదిరి తనిఖీలు చేపట్టి పూర్తి స్థాయిలో నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విచ్చలవిడిగా వినియోగం

జిల్లాలోని పాన్‌దుకాణాలు, కిరాణ, హోటల్‌లు, చిరు వ్యాపారులు, తోపుడు బండ్లు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లు ఇలా అన్నిచోట్ల గుట్కా విక్రయాలు జరుగుతున్నాయనేది జగమెరిగిన సత్యం. గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఈ వ్యాపారం విస్తరించింది. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పోగాకు, నికోటిన్ కలిగి ఉండే గుట్కా ఉత్పత్తుల విక్రయాలు, వినియోగంపై నిషేదం విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. తయారి, నిల్వ, అమ్మకం, రవాణాలపై పూర్తిస్థాయిలో నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. ప్యాకెట్లు, డబ్బాలు ఇలా ఏ రూపంలో ఉన్న చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు తర్వాత వ్యసనంగా మారుతుంది. చెడు సావాసాలు, చదువుకు దూరంగా ఉండడం, గుట్కా తినడం ఒక గుర్తింపుగా భావించడం దీనికి కారణాలుగా కనిపిస్తున్నాయి. తోటి వారు తినడంతో గుట్కా,పోగాకు అలవాటు చేసుకుంటున్న వారి సంఖ్య ఎక్కువవుతుంది. నోటి సంబంధిత దుష్ప్రభావాలు,నోటిలో పుండ్లు, క్యాన్సర్‌లు, ఇతర మానసిక, శారీరక రోగాల భారిన పడే అవకాశాలు ఉంటాయని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు.

రూ. లక్షల్లో వ్యాపారం

జిల్లా వ్యాప్తంగా గుట్కావ్యాపారం ఒకరోజుల్లో లక్షకు పైగా ఉంటుందని అంచనా,సగటున ఒకరురోజులో సుమారుగా 4 నుంచి 8 వరకు గుట్కా ప్యాకెట్లు వినియోగిస్తున్నారు. ఇది పోగాకు,ఖైని, గుట్కా ఇలా పలు రూపాల్లో లభిస్తుంది. గుట్కాకోసం కనీసం ఖరీదును బట్టిరూ.100 నుంచి ఒక్కొక్కరు రూ.150 వరకు కూడా ఖర్చుచేస్తు న్నారు. జిల్లాకు గుట్కాలు ప్రధానంగా హైదరాబాద్, మహరాష్ట్ర నుంచి కూడా సరాఫరా అవుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. మహారాష్ట్రలో గుట్కాలపై నిషేదం గతంలో నుంచి అమలులో ఉంది. అయితే అక్కడ బ్లాక్ మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే గుట్కాలను జిల్లాలో తీసుకువచ్చి అమ్ముతున్నారనే విమర్శలు లేకపోలేదు.


జిల్లాలో వ్యాపారస్తుల వద్ద గుట్కాలను గుర్తించిన పోలీసులు(ఫైల్)

పోలీసులు మరోమారు ఉక్కుపాదం మోపేనా

ప్రతి పల్లెకు విస్తరించి ఉన్న ఈ గుట్కా వ్యాపారం నియంత్రణ సాధ్యమవుతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిస్థాయిలో అమలైతే ప్రజలకు ప్రయోజనం చేకురుతుంది. పేద, మధ్యతరగతి ప్రజలే ఎక్కువగా గుట్కాకు బానిసలుగా ఉన్నారు.గతంలో చాలాచోట్ల గుట్కా విక్రయాలపై పోలీసులు దాడులు చేయడంతో పాటు పెద్దఎత్తున గుట్కా సంచులను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాకేంద్రంలో ఏకంగా ఓ ఇంట్లో గుట్కాలు తయారుచేసిన కేంద్రాన్ని సైతం గుర్తించి తయారిదారుని అరెస్ట్ చేశారు. గాంధారిలో దాడులు చేసి భారీగానే గుట్కాలను పట్టుకున్నారు. అయితే నిషేధం విధిస్తేనే లాభాలు పెరుగుతాయనే వ్యాపారులు భావిస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌లో కావాల్సిన గుట్కాలు లభిస్తాయని వాటిని ధర పెంచి అమ్మితే వినియోగదారులు కొనుగోలు చేస్తారని ఆలోచనలు చేస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో మాదిరి పోలీసులు మారో మారు గుట్కా విక్రయాలపై ఉక్కుపాదం మోపుతారో లేదో వేచి చూడాలి.


జాడిలో రైతు నేస్తం దృశ్యం

రైతునేస్తం కార్యక్రమం ప్రారంభం

బోధన్‌రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామంలో సోమవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ సాలూర తహసీల్దార్ శశిభూషణ్, మండల వ్యవసాయ శాఖ అధికారి, రైతులు వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శశిభూషన్ మాట్లాడుతూ రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మూడవ విడత రాష్ట్రంలో 1031 రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవంలో భాగంగా జాడి జమాల్‌పూర్ రైతు వేదిక నందు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభించబడిందన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సంబంధిత అధికారులు రైతులకు ముఖ్య సలహాలు, సూచనలు ఇచ్చారన్నారు. శాస్త్రవేత్తలతో ముఖాముఖి జరుపబడిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూత్‌పల్లి రైతు వేదికలో..

డొంకేశ్వర్: నూత్‌పల్లి రైతు వేదికలో రైతునేస్తం కార్యక్రమంలో రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నూత్‌పల్లి, డొంకేశ్వర్ రైతువేధికల్లో ఈ కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఏవో మధుసుదన్, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, కార్య దర్శి వనజ, మౌనిక, మారంపల్లి లిఫ్ట్ చైర్మన్ బోజారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నవీపేట, నాగేపూర్, జన్నేపల్లిలలోని రైతు వేదికలలో...

నవీపేట: మండలంలోని నవీపేట, నాగేపూర్, జన్నేపల్లిలలోని రైతు వేదికలలో సోమవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని 1031 రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభోత్సవం జరిపి రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో పాటు ఇతర మంత్రుల ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట రమణ, ఏవో నవీన్ కుమార్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

కోటగిరి, పొతంగల్ మండలాల్లో..

కోటగిరి: కోటగిరి, పొతంగల్ మండలాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు నేస్తం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. 3వ విడతలో భాగంగా కోటగిరి మండలంలోని కొత్తపల్లి, ఎత్తొండ, పొతంగల్ మండలంలోని హెగ్డోలి రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. పంటల సాగులో శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ అధికారులు రాజు, నిశిత, ఏఈవోలు సందీప్, గౌస్, ఆస్మా బేగం తదితరులు పాల్గొన్నారు.


ఎత్తొండ రైతు వేదికలో సీఎం ప్రసంగాన్ని వింటున్న రైతులు, అధికారులు

మాదక ద్రవ్యాలతో యువత జీవితాలు నాశనం చేసుకోవద్దు

● రుద్రూరు ఎస్సై సాయన్న

రుద్రూరు, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలతో యువత జీవితాలు నాశనం చేసుకోవద్దని రుద్రూరు ఎస్‌ఐ సాయన్న సూచించారు. సోమవారం రుద్రూరు మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణం వద్ద మాదక ద్రవ్యాల నిర్మూలనకై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సాయన్న మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో యువత జీవితం నాశనం అవుతుందని వాటి బారిన పడవద్దని అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంపై పోలీస్ శాఖ దీనిపై నిఘా ఉంచిందన్నారు. ఎవరైనా గంజాయి సేవిస్తున్నట్లు గాని, సరఫరా చేస్తున్నట్లు గాని సమాచారం ఉంటే డయల్ 100కు లేక డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం టోల్‌ఫ్రీ నెంబర్ 1908కి చేయాలని కోరారు. డ్రగ్స్ అనేది భయంకరమైన అలవాటని బానిసలు కావద్దని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ రాజు, హెడ్ కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుళ్లు, ఏఎన్ఎం గౌరీ, ఆశా వర్కర్లు లత, ప్రేమల, నిర్మల, ప్రధానోపాధ్యాయులు, ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

● కోటగిరి ఎస్సై సునీల్

కోటగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోటగిరి ఎస్‌ఐ సునీల్ సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సోమవారం మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో యువత జీవితం నాశనం అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి విక్రయించిన సేవించిన సమాచారం అందించాలని ఆయన సూచించారు. డ్రగ్స్ అనేది భయంకరమైన అటవాటని దానిని బానిస కావద్దని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌లు తదితరులు పాల్గొన్నారు.


కోటగిరిలో మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


పొతంగల్‌లో ఈదురు గాలులకు కింద పడ్డ విద్యుత్ స్తంభం(ఫైల్)


కల్లూర్ విద్యుత్ సబ్ స్టేషన్


రాంపూర్ రోడ్డులో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

అప్రమత్తతే శ్రీరామ రక్ష!

● వర్షాకాలం విద్యుత్ ప్రమాదాలకు అవకాశం ● నిర్వహణకు జాగ్రత్తలు పాటించాలి ● విద్యుత్‌పై నిర్లక్ష్యం చేస్తే ప్రాణనష్టం

కోటగిరి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలతో మనుషులు, మూగ జీవాల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. వానకాలం సందర్భంగా గాలివానకు విద్యుత్ స్తంభాలు విరిగి పడడం, విద్యుత్ లైన్‌లు తెగిపడడం, తీగలు కిందికి వాలిపోవడంతో విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయి. కాగా ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ అధికారులు తెలుపుతున్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయపనుల్లో నిమగ్నం అయ్యారు. కాగా వ్యవసాయ బావుల మోటార్లు, స్టార్టర్ల వద్ద జాగ్రత్తలగా ఉండాలని సూచిస్తున్నారు. పలు జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాల నుండి రక్షించుకోవచ్చని వివరిస్తున్నారు.

● ప్రమాదాలకు గురి కాకుండా

వ్యవసాయ పొలాల వద్ద పశువులు, రైతులు మృతి చెందిన సంఘటనలు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి. వర్షాలు పడినప్పుడు ఇతర సమయాల్లో విద్యుత్ తీగలు తెగిపడడం, విద్యుత్ స్తంభాలు విరిగిపడి విద్యుత్ సరఫరా జరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మరో వైపు ఇళ్లలో ప్రజలు తీగలపై దుస్తులు ఆరవేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి. వర్షానికి తడిసిన గోడలను, విద్యుత్ స్తంభాలను ముట్టుకోకూడదు. విద్యుత్ సరఫరా ప్రమాదాల సమయాల్లో హెల్ప్ లైన్ నెంబర్ 1912 సమాచారం అందించాలని వివరించారు.

● వర్షాకాలంలో పాటించాల్సిన జాగ్రత్తలు

వ్యవసాయ బావుల వద్ద మోటార్లు, స్టార్టర్లను తడి చేతులతో తాకవద్దు.

- మోటార్‌లలో ఏవైన సమస్యలు వచ్చినప్పుడు సొంతంగా మరమ్మతులు చేయకుండా సంబంధిత మెకానిక్‌ను సంప్రదించాలి.
- విద్యుత్ సరఫరాలో సమస్యలు ఎదురైనప్పుడు రైతులు, ప్రజలు విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలి.
- మోటార్ల వద్ద స్టార్టర్లను చెక్ బాక్స్‌లలో ఎత్తుగా ఏర్పాటు చేసుకోవాలి.
- వర్షాలకు తెగిపడిన విద్యుత్ తీగలు, కూలిన స్తంభాల వద్ద విద్యుత్ సరఫరా అయితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి.
- ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసుకున్న ఇనుప రేకులకు విద్యుత్ సరఫరా అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇనుప తీగలను దండాలుగా కట్టుకోవద్దు.
- పశువులు, విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ల తీగల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి.
- ప్రతి ఇంట్లో వైరింగ్ కోసం నాణ్యమైన ఉత్పత్తులను వినియోగించాలి. తప్పకుండా ఎర్తింగ్ చేసుకోవాలి.
- తడి చేతులతో ప్లగ్‌లు, మోటార్లను ముట్టుకోవద్దు, చార్జింగ్ పెట్టి సెల్‌ఫోన్‌లలో మాట్లాడవద్దు.
- విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని ముట్టుకోకుండా అతడిని విద్యుత్ తీగల నుంచి వేరు చేసేందుకు కర్ర, ప్లాస్టిక్ వస్తువులతో ప్రయత్నించాలి.
- వ్యవసాయ క్షేత్రాల వద్ద నాణ్యత గల పంపు సెట్లను వినియోగించాలి.
- ఇంట్లో వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ వైర్లు ఫెయిల్ అయిన వాటిని గుర్తించి నాణ్యమైన కొత్తవి వినియోగించాలి.
- పంట పొలాల చుట్టు విద్యుత్ తీగల కంచెను ఏర్పాటు చేయవద్దు.


సుద్దులం శివారులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

- విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరం.
- మోటార్ రిపేర్లు అర్హత గల ఎలక్ట్రీషన్‌తో మాత్రమే చేయించాలి.
- తక్కువ ఎత్తులో విద్యుత్ వైర్లను గుర్తించి అధికారులకు వివరించాలి.

● జాగ్రత్తలు పాటించాలి

- బుజ్జిబాబు, ఏఈ, కోటగిరి



వర్షాకాలం విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల బారిన పడకుండా అవగాహనతో జాగ్రత్తలు పాటించాలి. విద్యుత్ స్తంభాలు కూలడం, విద్యుత్ తీగలు తెగిపడడం వంటివి జరిగితే వెంటనే విద్యుత్ అధికారులకు సమా చారం అందించాలి. రైతులు వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన మోటార్ల వద్ద తడి చేతులతో ముట్టుకోకుండా జాగ్రత్తలు పాటించాలి. అతుకులు గల పాత వైర్లకు బదులుగా కొత్త వైర్లను ఏర్పాటు చేసుకోవాలి.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

యోగా పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా 11వ దినోత్సవం సందర్భంగా రూపొందించిన గోడప్రతులు, కరపత్రాలను కలెక్టర్ టీ.వినయ్‌కృష్ణారెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ నెల 21న ఉదయం 6.55 నిమిషాల నుంచి 8.30 వరకు ఆర్మూర్ రోడ్‌లోని శ్రీరామ గార్డెన్‌లో ఈ యోగా డేను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని యువజన సంఘాలు, మహిళా మండళ్లు, విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, క్రీడాకారులు అన్ని వర్గాల వారు పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. జిల్లా ఆయుష్ విభాగం నోడల్ అధికారి డాక్టర్ జె.గంగాదాసు, వైద్యులు తిరుపతి, వెంకటేశ్, డీపీఎం వందన, ఫార్మసిస్ట్ ఎం.పురుషోత్తంతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కార్పొరేషన్ చైర్మన్లు

నిజామాబాద్ అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన వినయ్‌కృష్ణారెడ్డిని రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్‌లు తాహెర్‌బిన్ హందాన్, మానాల మోహన్‌రెడ్డిలు సోమవారం కలెక్టరేట్‌లో కలిశారు. ఆయనకు అభినందనలు తెలిపారు. జిల్లా విషయాలను ఆయనతో వివరించారు. వారితో పాటు కాంగ్రెస్ నేత గంగారెడ్డి కూడా కలిసిన వారిలో ఉన్నారు.

సీపీని కలిసిన కమాండెంట్



పోలీసు కమిషనర్‌కు పూలమొక్కను అందజేస్తున్న కమాండెంట్

నిజామాబాద్ అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి.సాయి చైతన్యను డిచ్‌పల్లి 7వ బెటాలియన్ కమాండెంట్ టి.సత్యనారాయణ సోమవారం కార్యాలయంలో కలిశారు. ఈ మధ్యనే బెటాలియన్ కమాండెంట్‌గా బాధ్యతలు తీసుకోవడంతో మర్యాద పూర్వకంగా వచ్చి కమిషనర్‌ను కలిశారు. బెటాలియన్‌లో ఉన్న సిబ్బంది, ఇతర అంశాలపై ఆయనతో చర్చించారు.

మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై

ధర్పల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ధర్పల్లి ఎస్సై రామకృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని దుబ్బాక గ్రామంలో మత్తు పదార్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించే వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ముఖ్యంగా యువకులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా క్రీడలవైపు మొగ్గు చూపాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల జీవితాలు నాశనం అవుతాయని చెప్పారు. సేవించిన వారే కాకుండా కుటుంబాలు సైతం వీధినపడే అవకాశం ఉందన్నారు.మత్తు పదార్థాల జోలికి పోకుండా యువకులు, గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా చేసిన డీలర్‌పై చర్యలు తీసుకోవాలి

డిచ్‌పల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ భూమిని కబ్జా చేసి తనపేరుపై పట్టా మార్చుకున్న మిట్టపల్లి గ్రామ రేషన్ డీలర్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు ఒడ్డెం నర్సయ్యపై చర్యలు తీసుకోవాలని మిట్టపల్లి గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు పత్రాలను స్థానిక విలేకరులకు గ్రామస్తులు అందజేశారు. గ్రామ శివారులోని 358 సర్వే నెంబర్‌లో 21 గుంటల భూమిని గత కొన్నేళ్లుగా ప్రభుత్వ భూమిగా కొనసాగుతుందని రెవెన్యూ అధికారుల సహకారంతో రేషన్ డీలర్ తన పలుకుబడిని ఉపయోగించి అట్టి భూమిని పట్టాపాసు పుస్తకం చేయించుకొని కబ్జా చేశాడని వెంటనే అట్టి పట్టాను రద్దు చేసి గ్రామస్తులకు అందుబాటులో ఉంచే విధంగా చేయాలన్నారు. అంతేకాకుండా రేషన్‌లో కూడా అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని వారు పేర్కొన్నారు. కబ్జా దారులకు సహకరిస్తున్న రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసిన తమపై కోర్టు కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

రైతు నేస్తంలో అధికారులు ప్రజాప్రతినిధులు

మోపాల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం రైతు నేస్తం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం నూతన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా మోపాల్ మండల కేంద్రంలో ఉన్న రైతువేదిక భవనంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయానికి సంబంధించి రైతులకు నేరుగా శాస్త్రవేత్తలతో సలహాలు సూచనలు అందించడం జరుగుతుందన్నారు. రైతుల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను చేపడుతున్నారని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్,గ్రంథాలయ చైర్మన్ రాజరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, ఆర్డీవో రాజేందర్ కుమార్, ఏవో సౌమ్యసొసైటీచైర్మన్‌లు, వైస్‌చైర్మన్‌లు, రైతులు పాల్గొన్నారు.

తడి చెత్త పొడి చెత్తపై అవగాహన సదస్సు

సుభాష్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):వంద రోజుల ప్రణాళికలో భాగంగా నగరంలో తడి చెత్త పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాల్లోని కాలనీవాసులకు తడి చెత్త, పొడి చెత్త వేరుచేయడం వల్ల కలిగే లాభాలను వివరించారు. మురికి కాలువలో యాంటీ లార్వా స్ప్రేను చల్లారు. వాటర్ ట్యాంకులకు క్లోరినేషన్ చేశారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా సుమారు 100 వాటర్ ట్యాంకులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, మున్సిపల్ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యానంపల్లిలో పశువైద్య శిబిరం

డిచ్‌పల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):డిచ్‌పల్లి మండలంలోని యానంపల్లి గ్రామంలో సోమవారం డిచ్‌పల్లి పశువైద్య అధికారి డాక్టర్ గోపికృష్ణ ఆధ్వర్యంలో మూగజీవాలకు నట్టల నివారణ టీకాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్టాప్ డయేరియాపై అవగాహన సదస్సు

ఇందల్వాయి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన సంక్షేమ బాలికల కళాశాలలో తిర్మన్‌పల్లిలో విద్యార్థులకు స్టాప్ డయేరియా కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎండాకాలం నుంచి వర్షాకాలం మారుతున్న సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శంకర్ మాట్లాడుతూ సీజన్ మారడం వల్ల సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వచ్చే సీజనల్‌లో కొత్త నీరు చేరుతుంది కాబట్టి కాచి వడబోసిన నీటిని తాగాలని లేనిచో విరోచనాలు వచ్చే అవకాశం ఉన్నాయన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పద్మజ,నర్సింగ్ ఆఫీసర్, ఆరోగ్య సిబ్బంది ఆనంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

నిజామాబాద్ అర్బన్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తూ ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఇతర అధికారులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ సమస్యలను పరిష్క రించేందుకు కలెక్టరేట్‌కు వస్తున్నారని అన్నారు. కలెక్టర్ తో పాటు ఇతర అధికారులకు వచ్చే ఆ ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఒకసారి ఫిర్యాదులు వస్తే వాటిని వెంటనే పరిష్కరించే విధంగా చూడాలని కోరారు. ప్రతీసారి ప్రజావాణికి వచ్చి ఫిర్యాదులు ఇచ్చే విధంగా చూడవద్దని ఆయన తెలిపారు. ప్రజావాణిలో సోమవారం 123 ఫిర్యాదులు రావడంతో ఆయా శాఖలకు పంపించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

మోపాల్ మండలానికి నాకు ఎంతో అనుబంధం: ఎమ్మెల్యే



ఎస్‌బీఐ భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేసిన రూరల్ ఎమ్మెల్యే

మోపాల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలోని మోపాల్ మండలానికి నాకు ఎంతో అనుబంధం ఉందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. సోమవారం మోపాల్ మండల కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అడ్మినిస్ట్రేటీవ్ భవన నిర్మాణానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి బ్యాంకు డీజీఎం విజయ్‌కుమార్ సాహూతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలానికి నాకెంతో అనుబంధం ఉందని అన్నారు. గతంలో తెలంగాణ ఉద్యమంలో మోపాల్ మండల ఏర్పాటుకు తాను ఎంతో కృషి చేశానని అన్నారు. ఎస్‌బీఐ బ్యాంకు అంటే ఆర్‌బీఐ బ్యాంకు గుండెకాయ లాంటిదని అన్నారు. 30 కోట్లతో ఈ భవనం నిర్మాణం చేసుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. ట్రైనింగ్ సెంటర్ కావాలని అడుగుతున్నారని భవిష్యత్తులో చేసుకుందామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హామీ ఇచ్చారు.ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఎస్‌బీఐ బ్యాంకు అడ్మినిస్ట్రేటీవ్ భవన నిర్మాణం చేసుకోవడం జరుగుతుందన్నారు. 120 సంవత్సరాల అనుభవం గల ఈ బ్యాంకు మన ప్రాంతంలో బ్రాంచ్‌ని స్థాపించడం వల్ల మోపాల్ ప్రజలకు ఉపాధి కల్పిస్తుందని ఇక్కడ ప్రాంత వాసులకు 4వ స్థాయి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎస్‌బీఐ అధికారులను ఎమ్మెల్యే కోరారు. మంచిప్ప ఎస్‌బీఐ బ్రాంచ్‌ను అక్కడి నుంచి తరలిస్తామని అనగాబ్యాంకు భవనం కోసం ఎమ్మెల్యే కోటా నుంచి నిధులు మంజూరు చేశామన్నా రు. ఇప్పుడు ప్రస్తుతం మంచిప్ప ఎస్‌బీఐ బ్యాంకు వ్యవసాయ దారులకు, ప్రజలకు రుణాల రూపంలో సహకారం అందిస్తుంద న్నారు. ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేటీవ్ భవనంతో పాటు మండల రెవెన్యూ కార్యాలయం, పోలీస్ స్టేషన్, మండల ఎంపీడీవో కార్యాలయం, మండల ఎగ్రికల్చర్ కార్యాలయం వంటి భవనాలు అన్ని ఒకే సముదాయంలో ఉండాలని స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. మంచిప్ప ప్రాజెక్టును పాత డిజైన్‌కు ప్రభుత్వం అనుమతించిందని అన్నారు. డీజీఎం విజయ్‌కుమార్ సాహూ మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అడ్మినిస్ట్రేటీవ్ భవనానికి స్థలం ఇవ్వాలని అనగానే రూరల్ ఎమ్మెల్యే అనుకూలంగా స్పందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, సొసైటీ చైర్మన్‌లు గంగారెడ్డి, మోహన్‌రెడ్డి, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్, ఆర్డీవో రాజేంద్రకుమార్, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు పసూల శ్రీను, తహశీల్దార్ రామేశ్వర్, ఎంపీడీవో రాములు నాయక్, పార్టీ అధ్యక్షుడు సాయరెడ్డి, నాయకులు జలేందర్‌రెడ్డి, సూర్యరెడ్డి, ప్రతాప్, సతీష్‌రెడ్డి, గంగాప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

● రూరల్ ఎమ్మెల్యేను కలిసిన టీఎన్‌జీవోస్ నాయకులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని టీఎన్‌జీవోస్ నాయకులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిశారు. జిల్లా కేంద్రంలోని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి సమస్యలను విన్నవించారు.ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు సుమన్‌కుమార్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, నాయకులు బోల శ్రీనివాస్, జాఫర్ హుస్సేన్, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: భూసార పరీక్షలతో పాటు పంట మార్పిడి చేసి పంటలు సాగుచేస్తే పంట దిగుబడి సాధించవచ్చని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని అర్గుల్ గ్రామంలో రైతువేదిక భవనంలో రైతు నేస్తం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణరెడ్డి కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, వ్యవసాయాధికారిణి దేవిక, మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ ఎం. సాయిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, సింగిల్ విండోల చైర్మన్‌లు ఆర్మూర్ గంగారెడ్డి, కాటిపల్లి నర్సరెడ్డి, నాగుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు గోర్తపద్మ రాజేందర్, చిన్నసాయిరెడ్డి, పంచాయితీ కార్యదర్శి హరీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తండ్రిని చంపిన కూతురు

● మండలంలోని ధర్మారంలో దారుణం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వినయ్‌లు

నవీపేట,జూన్16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మారంలో ఫాదర్స్ డే మరుసటి రోజున దారుణం జరిగింది. గ్రామానికి చెందిన పల్లపు నర్సయ్య(54)అనే వ్యక్తిని అతని సొంత కుమార్తె వర్షిత అలియాస్ మమత రోకలి దుడ్డుతో తలపై బాది హత్య చేసింది. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మారంకు చెందిన పల్లపు నర్సయ్య కూలి పని చేసేవాడు. నర్సయ్యకు భార్య నర్సమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె గంగామణిని వర్ని మండలం జలాల్‌పూర్‌కు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేయగా ఆమె భర్త గతంలోనే మృతి చెందగా గత కొన్ని సంవత్సరాలుగా పుట్టింటిలోనే ఉంటుంది. చిన్న కుమార్తె వర్షిత అలియాస్ మమతను నిజామాబాద్ రూరల్ మండలం తాళ్ల కొత్తపేటకు చెందిన శ్రీకాంత్‌కు ఇచ్చి వివాహం జరిపించగా వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇటీవల నర్సయ్యకు అతని భార్య నర్సమ్మకు మధ్య గొడవ జరుగగా 10రోజుల క్రితం నర్సమ్మ పెద్ద కూతురు గంగామణిలు కలిసి తమ బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం చిన్న కూతురు వర్షిత ధర్మారంలోని తన పుట్టింటికి వచ్చింది. మధ్యాహ్నం సమయంలో తన తండ్రి నర్సయ్య తలపై రోకలి దుడ్డుతో బాదడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే ఆమె నవీపేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు లొంగిపోయింది. సంఘటన స్థలాన్ని నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వినయ్‌లు పరిశీలించారు. మృతుడి సోదరుడి కుమారుడు గంగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కుటుంబ తగదాలు, ఇతర కారణాలతో ఈ హత్య జరిగి ఉంటుందని భావిస్తున్నట్లు గంగారెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

సుభాష్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. సోమవారం వరంగల్ కార్పొరేట్ కార్యాలయంలో 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న లూస్ లైన్‌లను, వంగిన పోల్స్‌ను, తుప్పుపట్టిన పోల్స్‌ను, తక్కువ ఎత్తులో ఉన్న డీటీఆర్‌లను గుర్తించి సరిచేయాలన్నారు. వర్షాకాలం అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. సర్కిళ్ల పరిధిలో ఉద్యోగులు అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారులకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే 1912 ద్వారా ఫిర్యాదులు చేయాలన్నారు. ప్రమాదాలను సమర్థవంతంగా తగ్గించడానికి అన్ని అంశాలలో భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డైరెక్టర్లు అశోక్ కుమార్, మధుసూదన్, రాజుచౌహాన్, అశోక్, వెంకటరమణ, ఉత్తమ్, సురేష్, 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

డిచ్‌పల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో 21 మంది ఇందిరమ్మ లబ్ధిదారుకు ఇళ్ల మంజూరు పత్రాలను మాజీ సర్పంచ్ సుదర్శన్ ఆధ్వర్యంలో గ్రామ ప్రతినిధులు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిన ఎమ్మెల్యే భూపతి రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మొదటి విడతగా 31 ఇళ్లు నిరుపేదలకు ఎమ్మెల్యే మంజూరు చేశారని గ్రామస్తులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ జంగంశాంతయ్య, మాజీ సర్పంచ్ దాస్, కార్యదర్శి వినయ్, ఇంది రమ్మ కమిటీ ప్రతినిధులు శేర్ లింగం, తదితరులు పాల్గొన్నారు.

కార్మికవర్గ పోరాటాల బలోపేతానికే మహాసభలు



గడ్కోల్లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సిరికొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విప్లవ కార్మికోద్యమాన్ని బలోపే తం చేయడానికే ఈ నెల 19న మండల కేంద్రంలో టీయూసీఐ కామా రెడ్డి, నిజామాబాద్ రూరల్ జిల్లాల మహాసభలను నిర్వహి స్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ తెలిపారు. మండలంలోని గడ్కోల్ గ్రామంలో సోమవారం మహాసభకు సంబంధిం చిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గ వ్యతిరేక చర్యలు తీసుకుంటుం దన్నారు. హరించి వేయబడిన హక్కులను సాధించుకోవాలంటే కార్మి కులు ఐక్య పోరాటాలు చేయాలని రామకృష్ణ కార్మిక వర్గానికి పిలుపు నిచ్చారు. కార్మికులంతా సంఘటితమై పోరాడాలని కోరారు. ఈ కార్యక్ర మంలో మాస్‌లైన్ నాయకులు కిషోర్ మండల నాయకులు లింబాద్రి, నారగౌడ్, రాములు, కిరణ్, అనీస్, కట్ట రాములు పాల్గొన్నారు.

సిరికొండలో 'రైతు నేస్తం'

సిరికొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం కార్యక్రమాన్ని సీఎం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. మండలంలోని పెద్దవాల్గోట్, గడ్కోల్ రైతువేదికల్లో జరిగిన కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పెద్దవాల్గోట్ రైతువేదికలో తహసీల్దార్ రవీందర్‌రావు, గడ్కోల్లో జరిగిన కార్యక్రమంలో ఎండీవో మనోహర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి నర్సయ్య పాల్గొన్నారు. పంటల దిగుబడి పెరగడా నికి రైతులకు మంచి సూచనలు సలహాలు అందించాలని ముఖ్యమంత్రి సూచించారని మండల వ్యవసాయ అధికారి నర్సయ్య తెలిపారు.

పల్లెల్లో మొదలైన 'స్థానిక' ఎన్నికల సందడి

(ఐదో పేజీ తరువాయి)

ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ నామమాత్రం ఫలితాలు సాధించింది. రెండు జడ్పీటీసీ స్థానాలు, కొన్ని ఎంపీటీసీ స్థానాల్లో గెలుపొందింది. బీజేపీ కూడా రెండు జడ్పీటీసీ స్థానాలు, కొన్ని ఎంపీటీసీ స్థానాల్లో గెలిచింది. మిగతా అన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్‌యే కైవసం చేసుకుంది. జడ్పీ చైర్మన్ పీఠాన్ని కూడా చేజిక్కించుకుంది. ఈ దఫా త్రిముఖ పోటీ ఉండే పరిస్థితి కనిపిస్తుంది. ఈ ఎన్నికల్లో పల్లెల్లో మూడు పార్టీలకు పట్టు ఉంది. అధికారంలోకి పదేళ్ల తర్వాత వచ్చిన కాంగ్రెస్ నేతలు ఈ దఫా ఎలాగైనా మెజార్టీ స్థానాలను దక్కించుకోవాలని ప్రయత్నాల్లో ఉన్నారు. ఇప్పటికే నియోజకవర్గ ఇన్‌చార్జిల ద్వారా సమావేశాలు నిర్వహించి సమన్వయం కోసం పనిచేసిన నేతలు స్థానిక సంస్థల ఎజెండాగానే ముందుకు పోతున్నారు. అదే రీతిలో ఎక్కువ స్థానాల్లో పోటీ చేసేందుకు ఆ పార్టీకి చెందిన నేతలు పోటీ పడుతున్నారు.

పోటీకి ఆశావహుల ఏర్పాట్లు

జిల్లాలో ఎంపీటీసీ స్థానాలతో పాటు జడ్పీటీసీ స్థానాలకు ఎక్కువగా పోటీ చేసేందుకు ఆశావహులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో పార్టీ పరంగా టికెట్లు పొంది ఈ స్థానాలను గెలుచుకునే విధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు నేతలు కూడా ఎక్కువ మంది ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే రీతిలో గ్రామ పంచాయతీలో పార్టీ రహితంగా ఎన్నికలు జరిగిన కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఎక్కువ మంది సిద్ధమవుతున్నారు. సర్పంచ్‌గా గెలిచి గ్రామాల్లో చక్రం తిప్పే విధంగా ఇప్పటికే తమ వర్గాలను సిద్ధం చేసుకుంటున్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కీలక స్థానాలను కైవసం చేసుకునే విధంగా బీజేపీ నేతలు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. పంచాయతీల్లో కీలక ప్రాతినిధ్యం సాధించడంతో పాటు మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో కూడా ఎక్కువ సీట్లు సాధించుకునే విధంగా పార్టీ నేతలు ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. జిల్లా నుంచి ఎంపీతో పాటు ఎమ్మెల్యేలు ఇద్దరు ఉండటం వల్ల ముందస్తుగా సిద్ధమవుతున్నారు. పంచాయతీల్లో ప్రాతినిధ్యం ఎక్కువగా ఉంటే వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి వస్తుందని భావిస్తున్నారు. జిల్లాలో బీఆర్‌ఎస్ తరఫున కూడా ఎక్కువ మంది నేతలు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో వన్‌సైడ్‌గా ఎన్నికల్లో గెలిచిన నేతలు ఈ దఫా పోటీ ఎక్కువగా ఉన్నా కీలక స్థానాల్లో ప్రాతినిధ్యం ఉండే విధంగా సన్నద్ధమవుతున్నారు. పార్టీకి ఒక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యుడు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండగా మాజీ ఎమ్మెల్యేలు కీలకంగా ఉన్నారు. వీరి ఆధ్వర్యంలోనే ఎన్నికలకు పోయేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పార్టీ నుంచి కొంత మంది మాజీలు కాంగ్రెస్, బీజేపీ వైపు వెళ్లిన మిగతా వారి ద్వారా పోటీకి సన్నద్ధమవుతున్నారు. మూడు పార్టీల నుంచి నేతలు సిద్ధమవుతుండటంతో ఈ దఫా పల్లెపోరు త్రిముఖ పోటీ ఉండే పరిస్థితి కనిపిస్తుంది. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే రెండు నెలల పాటు పల్లెల్లో ఎన్నికల సందడి కొనసాగనుంది.

ఒకే విడతలో రుణమాఫీ

(ఐదో పేజీ తరువాయి)

ఉపయోగపడుతాయని తెలిపారు. అర్గుల్‌లోని రైతువేధిక నుంచి రూరల్ ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి పాల్గొన్నారు. మోపాల్ రైతు వేదిక నుంచి రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ఆలూర్ నుంచి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి నుంచి రాష్ట్ర సహకార సంఘాల లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్లు, వివిధ కమిటీల చైర్మన్‌లు, రైతులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

'అమరుల ఆశయ సాధన కోసం పోరాడుదాం'

సిరికొండ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పీడిత ప్రజల విముక్తి కోసం పనిచేసి అమరులైన వారి ఆశయ సాధన కోసం పోరాడుదామని ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి కారల్ మార్క్స్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన నాయక్‌వాడి నర్సయ్య సంస్మరణ సభలో పాల్గొని నర్సయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కారల్ మార్క్స్ మాట్లాడుతూ.. అర్సపల్లికి చెందిన నర్సయ్య రైతాంగ ఉద్యమాలు నడిపిన నాయకుడని అన్నారు. నిజాంసాగర్ ఆయకట్టు రక్షణ కోసం జరిగిన రైతుల ఉద్యమాలు, ఎన్సీఎస్‌ఎఫ్ సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించడానికి జరిగిన పోరాటంలో నర్సయ్య చురుగ్గా పాల్గొన్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షుడు భూమేష్, కార్యదర్శి ఎల్లయ్య, నాయకులు గులాంహుస్సేన్, పీవైఎల్ మండల అధ్యక్షుడు సంజీవ్, చిన్నా గంగాధర్, నర్సాగౌడ్, గాదె నర్సయ్య, పెద్దరాజగౌడ్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.115	రూ.200	రూ. 230
వెన్‌కాబ్(కిలో)	రూ.120	రూ.210	రూ. 240

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.99,300	రూ.91,900	రూ.1090

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : హౌటూ ట్రేయిన్ యువర్ డ్రాగెన్ (తెలుగు 3డి) (11.00, 1.45, 4.30)
: హౌటూ ట్రేయిన్ యువర్ డ్రాగెన్ (ఇంగ్లీష్ 3డి) (7.15, 10.00)
స్క్రీన్-2 : హౌజ్‌ఫుల్-5 (హిందీ) (10.10, 4.25)
: ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (తెలుగు) (1.40)
: ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (ఇంగ్లీష్) (7.55, 10.40)
స్క్రీన్-3 : అందాల రాక్షసి (10.40)
: ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (1.50)
: ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (తెలుగు) (4.20)
: హౌజ్‌ఫుల్-5 (హిందీ) (7.05, 10.35)
స్క్రీన్-4 : ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (తెలుగు) (10.50)
: అందాల రాక్షసి (1.35, 7.35, 10.45)
: ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (5.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : తొలిప్రేమ (11.00, 1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : అందాల రాక్షసి (4.30)
: హౌజ్‌ఫుల్-5 (హిందీ) (1.35, 7.30, 10.30)
స్క్రీన్-3 : అందాల రాక్షసి (10.20)

దేవి : తొలిప్రేమ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : అందాల రాక్షసి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : హౌజ్‌ఫుల్-5 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్